# శృంగార కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ



**నేను** అక్కడికి వెళ్ళేసరికి విశ్వనాథంగారు మొగలి పొదలవైపు దొంగ చూపులు చూస్తూ కనిపించారు. నా అలికిడికి తల తిప్పి "వచ్చారా—ఇంకా రాలేదేమిటా అని మీ కొరకే ఎదురుచూస్తున్నాను" అన్నారు చిరునవ్వు నవ్వుతూ.

"మధ్యాహ్నం పడుకొని లేచేసరికి ఆలస్యమైంది." ఆయన ప్రక్కనే పచ్చికపై కూర్చున్నాను.

నూతన ప్రభుత్వ విధానం వల్ల రెండేళ్ళు ముందుగానే రిటైరయిన వాళ్ళమే ఇద్దరమూను. అంతకుముందు ముక్తసరి పరిచయమే ఉన్న మేము కాలక్షేపానికి ఈ పార్కుకు వస్తూ బాగా సన్నిహితుల మయ్యాము.

"ఏంటో దీక్షగా చూస్తున్నారు" ఆయన ఇందాక చూసిన వంక చూడడానికి ప్రయత్నిస్తూ అడిగాను.

"చూడండి, ఎంత చక్కటి దృశ్యమో!" తను కొంచెం ప్రక్కకు జరుగుతూ కళ్ళతో మొగలి పొదల వంక చూపించారు.

అక్కడ — ఇద్దరు యువతీ యువకు లున్నారు. అమ్మాయి మోకాళ్ళు దగ్గర ముడుచుకొని కూర్చొనుంది. ఆమె ఒడిలో తల పెట్టి వెల్లకిలా పడుకొని ఉన్నాడో కుర్రాడు. అతని ఎడంచేయి ఆమె నడుమును చుట్టేసి ఉంది. కుడిచేయి ఆమె మోకాళ్ళ దగ్గర చీర కుచ్చిళ్ళతో ఆడుకుంటూంది. ఆమె ఎడంచేతిని వీపు వెనుక భూమిపై ఆధారంగా ఆనించింది. కుడిచేతి వేళ్ళు అతని జుత్తులో కదులాడుతున్నాయి. అత నేదో అంటున్నట్లుంది—ఆమె నవ్వుతూంది. పొడవైన ఆమె జడ భుజంపైనుండి ముందుకు జారి అతని మొహం మీద తారట్లాడుతూంది.

"అదృష్టవంతుడెవరో అందమైన అమ్మాయిని పట్టేశాడు" అన్నారు విశ్వనాథంగారు బరువుగా నిట్టూర్పు విడుస్తూ.

నిజమే నన్నట్లుగా మౌనంగా తల వూపాను.

"వాళ్ళ నలా చూస్తుంటే మీ కేమనిపిస్తుంది" తనే అడిగారు మళ్ళీ.

"ఈ వయస్సులో మన కేమనిపిస్తుంది" నవ్వాను

"అలా అంటారేం, మీరు వయసులో ఉన్నప్పటి మీ అనుభవాలు జ్ఞాపకం రావడం లేదూ?"

"ఉంటేగా జ్ఞాపకం రావడానికి. కనీసం నేనూ, నా భార్య అయినా ఈ కాలం దంపతుల్లా పార్కుల్లో గడిపిన వాళ్ళం కాదు." మళ్ళీ నవ్వాను.

"భార్యతో అనుభవాల గురించి కాదండీ, బాబూ, నే నడిగేది. గర్ల్ ఫ్రెండ్స్‌తో..."

"నా కలాంటి గర్ల్ ఫ్రెండ్సెవరూ లేరండీ."

"నే నమ్మను." దృఢచిత్తంతో అన్నా రాయన.

"నా గురించి తరవాత చర్చిద్దాం గానీ, మీ రలా మాట్లాడుతున్నారంటే, మీకున్నట్లేగా" ఎదురుదాడి ప్రారంభించాను.

ఒక్క క్షణం మౌనం వహించా రాయన. "ఎంతయినా ఆ లైఫే వేరండీ. ఇప్పుడు కావాలంటే వస్తుందా, మాక్సిమమ్ ఎంజాయి చేశాను అప్పట్లో. నేనేదో గొప్పలు చెబుతున్నా ననుకోబాకండి. నా యవ్వన జీవితంలో ఇలా గర్ల్‌ఫ్రెండ్స్‌తో గడిపిన సంఘటన లెన్నో ఉన్నాయి."

"బహుశా మీది ప్రేమ వివాహమై ఉండవచ్చు!" అడిగాను.

"కాదు—అరేంజ్డ్ మారేజే."

"అంటే మీరు భగ్న ప్రేమికు లన్న మాట."

"ఎంతమాత్రం కాదు. ఎందుకంటే నే నెవర్నీ ప్రేమించలేదు."

"అదేం అలా అంటున్నారు?" ఆశ్చర్యంగా అడిగాను. "మరి ఎన్నో అనుభవా లున్నా యంటున్నారుగా!"


"గర్ల్‌ఫ్రెండ్స్‌తో అనుభవాలకు, ప్రేమకు సంబంధం లేదని నా అభిప్రాయం."

"వోహో" అన్నాను.

విశ్వనాథంగారు కొద్దికొద్దిగా అర్థమవుతున్నారు.

"నే నో రచయితనైనా కాదు, క్రికెట్ ప్లేయర్నైనా కాదు. అయినా అమ్మాయిలు ఎందుకో పిచ్చిగా లొంగిపోయేవారు నాకు..." ఏవో భావాల్లో తేలిపోతున్నట్లుగా ఎదురుగా ఉన్న బంతిపూల మొక్కల వంక చూస్తూ చెబుతున్నా రాయన.

"నా కెంత మంది అమ్మాయిలతో పరిచయం ఉన్నదో లెక్కనే లేదు. పార్కుల్లో తిరగడం, సినిమాల కెళ్ళడం...అబ్బా! ఎంత థ్రిల్లింగ్‌గా ఉండేదో అప్పటి జీవితం! నా కెంత మందితో శారీరక సంబంధ మున్నదో చెబితే మీరు నమ్మలేకపోవచ్చు.



# మగ గొప్పదనం

గంగుల నరసింహారెడ్డి

కాని, ఇది అబద్ధం కాదు ..." అంటూ సంఖ్యను చెప్పారు.

ఎంతో ఆశ్చర్యపోయాను. "మీ మాటలు వింటుంటే మిమ్మల్నేమోగాని నా కీ ఆడపిల్లల శీలం మీదనే నమ్మకం పోతూందండి. అంత తేలిగ్గా లొంగిపోతారా?!" నాకు తెలియకుండానే ఏదో బాధ ధ్వనించింది నా గొంతులో.

"అమ్మమ్మ! అంత మా టనకండి. అందరు స్త్రీలు అందరు మగవాళ్ళ కెప్పుడూ లొంగిపోరు. కొందరు స్త్రీలు, కొందరు మగవాళ్ళకే అది తగును. కాని ఒక్కటి మాత్రం నిజం, ఒక సగటు అమ్మాయి ముందు పిడికెడు గుండెధైర్యం, సమయస్ఫూర్తి గల చొరవా ప్రదర్శిస్తే చాలు కనీసం వో ముద్దు అయినా దక్కి తీరుతుంది."

నేనేం మాట్లాడలేదు. విశ్వనాథం గారి మాటల్ని ఆలోచిస్తూ గతాన్ని తవ్వుకోవడానికి ప్రయత్ని స్తున్నాను.

"ఇప్పుడు చెప్పండి మీరు." అదో రకంగా నవ్వు తున్నా రాయన.

"చెప్పానుగా—నా కటువంటి అనుభవాలేం లేవు. గర్ల్‌ఫ్రెండ్స్ అంతకన్నా లేరు."

"నే న్నమ్మనుగాక నమ్మను. గర్ల్‌ఫ్రెండ్స్ లేని మగవాళ్ళుంటారా ఈ ప్రపంచంలో మీ కిష్టం లేకుంటే చెప్పకండి."

అతని వితండవాదానికి ఏమని సమాధానమివ్వాలో వెంటనే అర్థం కాలేదు. "గర్ల్‌ఫ్రెండ్ అనే మాటకు అర్థం నాకు ఏవరంగా తెలీదండి. సహజంగానే కొంతమంది తెలిసిన అమ్మాయి లుండేవారు. మా ఇంటి ప్రక్క ఇళ్ళలో ఉండేవారు కొందరు, మా చెల్లెలు ఫ్రెండ్స్ కొందరు. అంతేకాని వాళ్ళతో ఇలా పార్కుల్లో ఎన్నడూ తిరిగింది లేదు."

"పోనీ ఇంటిదగ్గరయినా అడ్వాన్సయ్యారా."

"అంటే...?"

"శారీరక సంబంధాలేవైనా ..." మళ్ళీ అదే వక్ర నవ్వు.

"ఛ, ఛ. అలాంటిదేం లేదు. నా మొదటి అను భవం నా భార్యతోనే, గురువుగారూ."

"కనీసం ముద్దు వరకయినా..."

"వ్చ్, అది కూడా లేదు."

"నమ్మ శక్యంగా లేదండి మీ వైనం. ఎలా ఉన్నారండీ, బాబూ, అలా యవ్వనాన్నంతా వృథా చేసుకున్నారు."

ఆయన మాటల్లోని వీక్ పాయింటుకు నవ్వు వచ్చింది. పరాయి ఆడవాళ్ళతో తిరగడమే యవ్వనానికి పరమార్థమా?

అయినా ... అయినా ...

మెదడులో ఏదో అనిశ్చితత. మనసులో ఎక్కడో మారుమూల విశ్వనాథంగారి మాటల ప్రభావం కనిపిస్తూనే ఉంది.

"పోనీ, మరో విషయం చెప్పండి—మీ కాలేజీ మేట్స్‌లో నయినా అమ్మాయిలు లేరా." తనే అడిగాడు మళ్ళీ.

"మాది కో—ఎడ్యుకేషన్ కాదులెండి. నేను చదివింది డిగ్రీయే."

"అయ్యో, ఎంత బ్యాడ్ లక్! యూనివర్సిటీలో పోస్టు—గ్రాడ్యుయేషన్ చేస్తేగాని చదువులోని థ్రిల్లింగ్ తెలిసిరాదండి. ఆ జీవితం అనుభవించని వారు ఎంతో దురదృష్టవంతులు నా దృష్టిలో."

ఎందుకో నా కా క్షణాన విశ్వనాథంగారు నిజంగానే నా కంటే గొప్పవారనే భావన కలిగింది.

"పక్కింటి అమ్మాయిలు పరిచయమే అంటున్నారుగా— అందంగా ఉన్న వా రెవరూ లేరా అందులో "

పదిహేనేళ్ళ పావని రూపం నా కళ్ళ ముందు మెదిలింది.

పండు నిమ్మ పసిమి దేహచ్ఛాయ—పుష్టిగా ఉండే అవయవ సంపద—నొక్కుల జుత్తు—సృష్టిలోని ఆకర్షణనంతా తనలోనే నింపుకున్న కళ్ళు—చక్కని ముక్కు—గులాబి రంగు పెదాలు— ఎదుగుతున్న యవ్వనంతో శిశిర శీతల ఉషోదయాన తుషార బిందువుల్లో తడిసి అరవిరిసిన గులాబీ మొగ్గలా ఉండేది.

ఎందుకో ఆ అమ్మాయి వంక సూటిగా కళ్ళలోకి చూడాలంటేనే ఎంతో కలవరమయ్యేది నాకు.

"చాలా అందంగా ఉండే దొక అమ్మాయి. నాతో కూడా చాలా క్లోజుగా ఉండేది." నా గొంతులో కించిత్తు గర్వం ధ్వనించిన ట్లనిపించింది నాకు.

"అంత క్లోజుగా చూస్తూ మీ కేమనిపించేది కాదా "

మనసులోనే నవ్వుకున్నాను.

అందానికి స్పందించని వా రెవరుంటారు ఈ లోకంలో అందరికీ ఏవేవో వూహలు జనిస్తాయి. ఎన్నెన్నో కోర్కెలు కలుగుతాయి. అన్నింటిని అందరూ ఆచరణలో పెడితే ఈ వ్యవస్థ ఇలా ఉండేదా!

నిజమే! పావనిని చూసినప్పుడల్లా మనసంతా తీయని బాధతో చలించిపోయేది. ముఖ్యంగా ఆ లేత గులాబి రంగు పెదాలను చూస్తే అవ్యక్తమైన అనుభూతితో అణువణువూ ఆర్తి సెగలో దహించుకుపోయేది. కాని ఎలా పరాయి స్త్రీని సమీపించాలో అప్పటికీ, ఇప్పటికీ నా కర్థంగాని విషయం. నా సంకోచానికి కారణం నా పిరికితనమో, సంస్కారమో నాకు సరిగా తెలియదు.

ఆ మాటే అన్నాను విశ్వనాథంగారితో. "ఎందు కనిపించేది కాదు వయసు సహజమైన కోర్కెలెన్నో కలిగాయి."

"ఎంత మంచి అవకాశం వదులు కున్నారండీ, మీరు కొంచెం ధైర్యం చేసి, చొరవ చూపించి ఉంటే ఆ అమ్మాయి మీకు జీవితాంతం మరిచి పోలేని ఒక తీయని అనుభవాన్ని మిగిల్చి ఉండేది." నిజంగా తనకే ఆ అనుభవం తప్పిపోయి నంత బాధ పడిపోతూ బరువుగా నిట్టూర్చారాయన, నాపై జాలి కూడా కనబరుస్తూ.

• • • •

ఇంటికి వచ్చినా మనసంతా వికలంగానే ఉంది. మెదడు నిండా ఏదో అనిశ్చితత చోటు చేసుకుంది.

"ఏంటి అలా ఉన్నా రీ వేళ తలనొప్పిగా ఉందా" అంది మా ఆవిడ నా మొహం చూసి.

"ఏం లేదు— బాగానే ఉన్నానులే." నాకు తెలీకుండానే అర్థంలేని కోపంతో విసురుగా అన్నాను.

నా ధోరణికి మొహం చిన్నబుచ్చుకుంది తను. అయినా నే నేం పట్టించుకో దలుచుకో లేదు. వయసు పైబడి ముడతలు పడ్డ దేహంతో,




ప్రాతినిధ్యంలేని పట్టణాలకుగాను ఏజెంట్లనుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను గనుక పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారానకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించ లేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యవలసిన లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడుకు చలువ నిస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

SHYAM AYURVED BHAVAN (AP)
P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105

ముగ్గుబుట్ట అయిన తలతో ఉన్న మా ఆవిడ రూపం ఇన్నేళ్ళ తరవాత వెగటు కలిగిస్తూంది. అసలు తను నాతో మాట్లాడ బోతుంటేనే డోకు వస్తుంది. ఇన్నాళ్ళూ తనతో ఎలా కాపరం చేశానా అని ఇప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది.

ఒక సగటు అమ్మాయి ముందు పిడికెడు గుండె ధైర్యం, సమయస్ఫూర్తి గల చొరవ ప్రదర్శిస్తే చాలు, కనీసం ఒక ముద్దు అయినా దక్కి తీరుతుంది.

"మీరు కొంచెం ధైర్యంచేసి, చొరవ చూపించి ఉంటే ఆ అమ్మాయి మీకు జీవితాంతం మరిచి పోలేని ఒక తీయని అనుభవాన్ని మిగిల్చి ఉండేది."

విశ్వనాథంగారి మాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి.

ధైర్యం చేసి ఉంటే నేను నిజంగానే పావని అధరామృతం చవి చూసి ఉండే వాడిని కాబోలు.

తను ఒకసారి అంది కూడాను నాతో—"మీకు ఆడపిల్లలతో ఎలా మాట్లాడాలో ఇంకా అలవాటయి నట్లు లేదే. ఆడపిల్ల కన్నా ఎక్కువ సిగ్గుపడి పోతారు మీరు." నే నప్పుడు నిజంగానే వెర్రి వెంగళప్పలా నవ్వి వూరుకున్నాను.

తన మాటలి బట్టే ఆలోచిస్తుంటే, తనకూ నా మీద ఇష్టమే ఉండేది కాబోలనిపిస్తుంది. నేనే ఒక పనికిరాని వెధవను కాబట్టే మంచి అవకాశం వదులుకున్నాను.

ఆ రోజు నా కింకా జ్ఞాపకం. ఇంట్లో నేను తప్ప ఇంకెవరూ లేరు. అప్పుడు వచ్చి తలుపు తట్టింది పావని. ఇంట్లో ఎవరూ లేరని చెప్పాను తలుపు దగ్గరే. అయినా లోపలికి వచ్చింది. ఏం సంకోచం లేకుండా ఒక గంటసేపు గడిపింది. ఏవేవో మాట్లాడింది. తను కావాలనే అలా అంత సేపు నాతో ఉందని ఆలోచిస్తే ఇప్పుడర్థమవుతుంది. నా మొద్దు బుర్రకు. కనీసం పావని చేతి వేళ్ళనయినా తాకలేక పోయాను కదా. అయ్యో, ఎంతటి పొరబాటు చేశాను. ఆ నాడే కొంచెం ధైర్యం చేసి ఉంటే...

మళ్ళీ ఒక్క అవకాశం లభించి ఉంటే...

ఎందుకో ఫక్కున నవ్వాలనిపించింది. ఈ ముసలి వయసులో ఎన్ని అవకాశాలు వస్తేనేం? అవకాశం కాదు రావా ల్సింది వయస్సు!


వ్యర్థమయిన యవ్వనం తిరిగి వస్తే... అబ్బా! అంత అదృష్టమా!

'ఆవో బచ్‌పన్ ఏక్ బార్ ఫిర్' అని ఎవరో అన్నారు కదా— 'ఆవో జవానీ ఏక్ బార్ ఫిర్' అని నే నంటున్నాను. కాదు, కాదు— ఆక్రోశిస్తున్నాను.

వచ్చేది యవ్వనం కాదు— మరణం! నాలుగయిదు సంవత్సరాల్లో బాల్చీ తన్నేస్తాను.ఇప్పుడు ఆక్రోశిస్తే ఏం లాభం? చేతులు కాలాక ఆకులు పట్టుకోవ డం అంటే ఇదే కాబోలు. పెళ్ళికాక ముందు కనీసం ఒక అమ్మాయి ముద్దు అయినా రుచిచూడని జీవితం కూడా ఒక జీవితమేనా!

ఇప్పుడు ఇంకో విషయంకూడా జ్ఞాపకం వస్తూంది. మరదలు మహాలక్ష్మితోను ఎంతో సన్నిహితంగా మసలే వాణ్ణి. కాని ఎన్నడూ ఇలాంటి ఆలోచనే రాలేదు. బాగా లావుగా ఉండేదన్న మాటే కాని మొహం అందంగానే ఉండేది.

అంతెందుకు? విశ్వనాథం గా రన్నట్లు ఆలో



చిస్తే సుజాత, లలితలు కూడా నాతో స్నేహంగా తిరిగిన వారే!

ప్చ్!

మంచం మీద పడుకున్నా నన్న మాటే కాని నిద్ర పట్టడం లేదు. అసంతృప్తిభావనతో నిండిన ఆలోచనలు మనసును కోస్తున్నాయి.

విశ్వనాథంగారు నిజంగా అదృష్ట వంతులే... ఎందరో అమ్మాయిలతో శారీరక సంబంధాలే కలిగి ఉన్నారంటే మాటలా దేనికయినా పెట్టి పుట్టాలి. అందరూ నాలా పిరికి సన్నాసులై ఉంటారా.

వ్యర్థం—ఈ నిస్సార జీవితమే వ్యర్థం. ఒక్క తీయని అనుభూతి అయినా లేని జీవితమూ ఒక జీవితమేనా దీనికన్నా సహారా ఎడారి నయం!

●　　●　　●　　●

రాత్రి సరిగా నిద్ర లేదేమో ఉదయం ఆలస్యంగా లేచాను. ఎంతో నీరసంగా ఉంది. మనసు నిండా నిస్పృహ. ఒక్క రోజులోనే ఇంకా ఎన్నో సంవత్సరాలు పైబడ్డ వానిలా డీలా పడిపోయాను.

మధ్యాహ్నం భోజనం తరవాత మేను వాల్చితే మాగన్నుగానే నిద్ర పట్టింది. ఒక గంట తరవాతను కుంటాను ఎందుకో చటుక్కున మెలకువ వచ్చింది. ఏవో మాటలు లీలగా చెవులకు సోకుతున్నాయి.

"వద్దు. వద్దు.'

"ప్లీజ. ప్లీజ!"



మంచంపై నుండి చప్పుడు కాకుండా లేచాను. పక్క గదిలోంచి వినవస్తున్నా యా మాటలు.

తలుపు దగ్గరగా వేసి ఉంది. కొద్దిగా తోశాను.

లోపల డిగ్రీ పూర్తయి బేవార్సుగా తిరిగే చివరి సుపుత్రుడు రవి ఎవరో అమ్మాయి భుజాలు పట్టుకుని తన వైపు లాక్కుంటూ మొహం వంచి ముద్దు పెట్టుకోవడానికి పెనుగు లాడుతున్నాడు.

"వద్దు రవీ, వద్దు. వదిలి పెట్టు, అంటూం దా అమ్మాయి.

గొంతు గుర్తు పట్టాను. ఆమె సుధ! విశ్వనాథం గారి అమ్మాయి!

"ప్లీజ, ఒక్కటే, ఈ ఒక్క సారికే అని మావాడు ప్రాధేయ పడుతూనే తన శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాడు.

పరాయి స్త్రీని లొంగ దీసుకునే ప్రయత్నంలో కౌగిలించుకున్న ప్రతి మగవాడు మాట్లాడే మొదటి మాట ఇదే— "ఒకటే ముద్దు, ఈ ఒక్కసారికే—అని. ముద్దంటూ పెట్టుకున్న తరవాత మగవాడు స్త్రీపై సంపూర్ణాధిపత్యం సంపాదించి నట్లుగా భావించి అంతటితో ఆగడు. ముద్దును ముద్దుగానే ప్రారంభించి కేవలం ముద్దు దగ్గరే ఆగి పోవడానికి మనం పాశ్చాత్యులం కాము. మన సంస్కృతిలో ముద్దు దగ్గరే అసలయిన శృంగారం ప్రారంభమయ్యేది.

నాకు ఉద్రేకం ఉప్పెనలా ముంచు కొచ్చింది· శరీరమంతా ఆవేశంతో వణికి పోయింది.

"రవీ!" అరిచాను కోపంగా, లోపలికి అడుగు లేస్తూ.

ఏ తీయని అనుభవమైతే నా జీవితంలో ఒక్క టైనా లేదని, నా దెంతో నిస్సార జీవితమని రాత్రి నుండి బాధపడుతూ ఉన్నానో, ఆ తీయనిఅనుభవాన్నే నా కొడుకుకు కూడా దక్కకుండా చేస్తున్నానని నే నా క్షణాన ఆలోచించ దలుచుకో లేదు. నా కప్పుడు తెలిసింది ఒక్కటే వాడు చేస్తున్నది తప్పుడు పని అని మాత్రమే!

ఇద్దరూ అదిరిపడి విడివడి దూరంగా జరిగారు. సుధ నిలువెల్లా వణికి పోతూంది. రవి అలానే విగ్రహంలా నిలబడిపోయి తల వంచుకున్నాడు.

నా కంతటి శక్తి ఎక్కణ్ణుండి వచ్చిందో నాకే తెలీదు. విసురుగా లేచిన నా చేయి రవి చెంపను చెళ్ళుమనిపించింది.

"ఒక అమ్మాయి జీవితంతో ఆడుకోవ టానికి సిగ్గు లేదురా దుర్మార్గుడా 'అన్నాను కోపంగా.

ఈ మాట అంది నిజంగా నేనే!

నిజంగా రవిని కొట్టింది నేనే.

కాదు, కాదు, రవిని కాదు కొట్టింది. నన్ను నేనే కొట్టుకున్నాను!

నా కప్పుడు తట్టిం దాపూహ. నా ఈ స్థానంలో విశ్వనాథం గారే ఉండి ఉంటే నా కన్నా తీవ్రంగా ప్రవర్తించేవారు. కూతుర్ని ఎడా పెడా వాయించి ఆయాసంతో కూలబడి పోయే వా రనుకుంటా.

పరాయి స్త్రీల విషయంలో విశ్వనాథంగారి 'గొప్పదనం'లో ఉన్న నిజమైన గొప్పదన మెంతో స్పష్టంగా తెలుస్తుందది నా కిప్పుడు. *